కథా కౌముది

“విశ్వావసు” నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

# లూసఫర్

నిర్మలాదిత్య (భాస్కర్ పులికల్)Tampa, FL

**చీకటి...**

అంటే, దుఃఖం, డిప్రెషన్, నేరం, ఈవిల్, అజ్ఞానం, తామసం...

చెప్పుకుంటూ పోవచ్చు.

అంతా వెలుగే ఉన్నా, పక్కింటి లానై లో మాత్రం చీకటి. అలాంటి చీకటిలో ఒక మనిషి ఎలా గంటలు, దినాలు గడపగలడు? అసలు గడపగలడా?

ఫ్లోరిడాకు, ఈ నగరానికి వచ్చి ఒక నెల అయ్యింది. పక్కింట్లో బాగా వయస్సైన జంట ఉన్నారని సీత చెప్పింది. పక్కింటి ఆవిడ మరియా తో సీతకు ఇట్టే స్నేహం కుదిరిపోయింది. మరియా వాళ్ళయననే, నేను ఇంతవరకు చూడలేదు.

దానికి కారణం అతను పగలంతా నిద్రపోయి, రాత్రుళ్ళు మేలుకుంటాడని, సీతనే మరియా ద్వారా విని చెప్పింది. పక్కింటి లానై లో చప్పుడైతే చూసాను. లానై లో చిమ్మ చీకటి. ఆ రాత్రుళ్ళు కూడ తను చీకట్లో గడుపుతున్నాడని అర్థం అయ్యింది.

“హలో నా పేరు విశ్వం. కొత్తగా ఈ ఇంట్లో చేరాం. మీ పేరు?” నన్ను నేనే పరిచయం చేసుకొన్నాను.

"లూసఫర్."

"లూసఫర్?"

"అవును, విశ్వం."

"లూసఫర్! పేరుకు తగినట్లు చీకట్లో కూర్చున్నారు," అన్నాను నేను, గట్టిగా నవ్వుతూ, నా నవ్వు నా మాటలను ఒక జోక్ గా మారుస్తాయని నమ్ముతూ.

"అంటే, చీకటిని నరకంతోను, నా పేరు సైతాన్ తోనూ జోడించేసావన్న మాట," లూసఫర్ సమాధానం ఇచ్చాడు. చీకట్లో అతని ముఖకవళికలు కనపడకపోవడం వల్ల మాటల శబ్దాలతోనే మా పక్కింటాయనను అంచనా వేయడం మొదలెట్టాను. నా మాటలు తప్పు పట్టినట్లు లేదు.

"లూసఫర్ అనగానే నాకు మిల్టన్ 'ప్యారడైజ్ లాస్ట్' గుర్తుకు వచ్చింది," అన్నాను నేను, నా మాటలు సర్ది చెప్పుతూ.

"ఏమి చేస్తున్నావు? మా లానై తలుపు తెరుస్తాను. రా కలిసి కూర్చోని కబుర్లు చెప్పుకుందాం."

మా ఇంటి లానై తలుపు తెరిచి, బ్యాక్ యార్డ్ లోనే నడచుకుంటూ వెళ్లి లూసఫర్ వాళ్ళ లానై లో అడుగు బెట్టాను.

"జిన్! ఇదొకటే వ్యసనం. ఒక రెండు గ్లాసులు త్రాగుతాను. రాత్రంతా ఇవే నాకు తోడు. నీకొకటి కలపనా?," అన్నాడులూసఫర్

"అబ్బే వద్దండీ. ఇట్స్ టూ లేట్. మీరు రాత్రంతా మేలుకొనే వుంటారా? అంటే పగలంతా నిద్రన్న మాట. అందుకే అనుకుంటా మిమ్మల్ని ఇన్ని రోజులు కలువలేక పోయాను. ఇప్పుడు కూడ ఏదో చప్పుడు విని మిమ్మల్ని పలకరించాను."

"మాకు టార్పాన్ స్ప్రింగ్స్ లో స్పాంజి గిఫ్ట్ షాప్ ఉండేది. అది నష్టాలతో మూతబడితే, ఆడ్ జాబ్స్ చాలా చేసాను. ఎక్కువగా నైట్ డ్యూటీల లోనే ఉండే వాడిని. ఉద్యోగ విరమణ తర్వాత కూడ , ఆ అలవాటు అలానే ఉండిపోయింది. రాత్రంతా నిద్ర పట్టక పొర్లాడుతుంటే మరియా నిద్రకు భంగం. అందుకే రాత్రులలో ఇలా మా ఇంటి వెనుక లానై లో కూర్చొని సమయం గడిపేస్తుంటాను. ఇంతకూ నీ సంగతేమిటి?

"టార్పాన్ స్ప్రింగ్స్, స్పాంజి షాప్ అంటే మీ తాతలు, ముత్తాతలు గ్రీక్ దేశం నుంచి వలస వచ్చుండాలి. నేను 'ఈ.బి.1' వీసా మీద ఒక పాతికేళ్ల ముందు వచ్చాను," అన్నాను గర్వంగా.

"కరెక్ట్ గా గెస్ చేసావు. అవును మా పూర్వీకులు గ్రీస్ దేశం నుండే వచ్చారు. ఐన్ స్టీన్ విసానే? నువ్వు మంచి తెలివైనవాడై ఉండాలి. ఆ వీసా పై అతి కొద్ది మందికి మాత్రమే ప్రవేశం లభిస్తుంది."

"అవును ఐన్ స్టీన్ వీసానే. చదువులో ఎప్పుడూ నేను ఫస్టే. ఇక్కడికి వచ్చిన వెంటనే గ్రీన్ కార్డు దొరికింది. ఐవీ లీగ్ యూనివర్సిటీ లలో ప్రొఫెసర్ గా పనిచేశాను. ప్రపంచమంతా కాన్ఫరెన్స్ లకని తిరిగాను. ఒక మూడు నెలల ముందే రిటైర్ అయ్యాను. వాతావరణం బాగుందని ఫ్లోరిడాకు మూవ్ అయ్యాము. మా ఇద్దరు పిల్లలు కూడ బ్రిలియంట్. ఒకరు

డాక్టర్, మరొకరు లాయర్. వెస్ట్ కోస్ట్ లో ఉంటున్నారు. మీ సంగతేమిటి?" వెనక్కు తిరిగి చూస్తే నా సక్సెస్ మీద నాకే అసూయ కలిగేలా అనిపించింది.

"గ్రేట్. నీ వలస ప్రయాణం 'అమెరికన్ డ్రీమ్' కు షో కేస్ లాగ ఉంది. కంగ్రాట్స్. మా కథ సగటు అమెరికన్ల కథనే," మా సంభాషణను త్రుంచేసాడు లూసఫర్.

అటు తరువాత లూసఫర్ ను కలవడానికి పెద్దగా ప్రయత్నించలేదు. ఇంటెలెక్చువల్ సర్కిల్స్ లో తిరిగిన నాకు, అతనితో సంభాషణ అంత ఎక్సైటింగ్ గా అనిపించలేదు. అతని పిల్లలు కూడ వాళ్ళింటికి రావడం చూడలేదు. పక్కనే ఓర్లాండో లో ఉన్న థీమ్ పార్క్ రిసార్ట్స్ లో దిగేవారు. వారి పిల్లల్ని చూసుకోవడానికి, తల్లి తండ్రులు మరియా, లూసఫర్ లను కూడ అప్పుడప్పుడు పిలిపించుకునే వారు.

లూసఫర్ పేరుకు తగ్గట్టే తన చుట్టూ, ఒక నరకం సృష్టించుకున్నాడనిపించింది. నాకా వాతావరణమంతా డిప్రెసింగ్ గా తోచేది. అంత సీదా, సాదగా, ఎలాంటి అంబిషన్ లేకుండా ఎలా జీవితాలు గడపగలరు. బ్రతుకు బాగా బ్రతికాననడానికి ఋజువు గా డబ్బు, పదవులు, పేరు – వాటిలో అన్నీ కాకపోయినా, కనీసం ఒకటో రెండో సాధించకపోతే, జీవితానికి పరమార్థమేముంది. పైగా పిల్లలతో కూడ అంతంత మాత్రమే సంబంధం. నాకు లూసఫర్ ఒక పెద్ద లూసర్ గానే అనిపించాడు.

రొటీన్ గా దినాలు గడుస్తున్న ఆ సమయంలో, ఒక రాత్రి లూసఫర్ నుంచి ఫోన్ వచ్చింది, అర్జెంటుగా ఎమర్జెన్సీ హాస్పిటల్ కు మారియాను తీసుకు పోతున్నానని, సీతకు చెప్పమని. మళ్ళీ చాలా రోజులు లూసఫర్ లానై లో కనపడలేదు. ఒంటరిగా చీకటిలో కూర్చుని త్రాగుతున్న లూసఫర్, బ్యాక్ యార్డ్ పోయినప్పుడెల్ల, గుర్తుకు వచ్చేవాడు. మనస్సు అదోలా అయ్యిపోయేది. ఎందుకో కొంతమందిని తలచుకుంటూనే డిప్రెస్సింగ్ గా అనిపిస్తుంది.

చీకటి...పవర్ పోయింది.

మొత్తం కమ్యూనిటీ లో కరెంట్ లేదు. ఎప్పుడొస్తుందో తెలియదు.

ఒకటి రెండు రోజులు అయితే పరవాలేదు కానీ, ఇలా వారాల తరబడి పవర్ లేకుండా బ్రతకడం ఇదే మొదటి సారి.

నాకు నిద్ర పట్టడం లేదు. మా ఆయన విశ్వం ను చూసాను. అదృష్టవంతుడు, పడుకున్న నిమిషానికే ఆదమరచి నిద్ర పోగలడు.

హరికేన్ 'మిల్టన్' పుణ్యమానని వీధి దీపాలతో సహా, వేల కొద్ది ఇండ్లకు మా నగరంలో కరెంట్ లేదు. రోడ్ల మీద, వందల ఏళ్ళు తమ పెద్ద కొమ్మలతో పందిరి వేసి, ప్రకృతి కళ్యాణాలు చేసిన ఓక్ చెట్లు కూలిపోయి, కార్లను ఇండ్లకు కట్టి పడేసాయి.

అదృష్టవశాత్తు ఇంట్లో కావలసిన సరుకులు, గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్ ఉండడం వల్ల తిండి సమస్య లేదు. కానీ ఫోన్ లు లేకుండా ఉండలేము కదా. వాటిని ఛార్జ్ చేయడానికి, రోజు విశ్వం ఒక గంట కారు ఐడిల్ లోనే నడుపుతున్నాడు. ఫ్లోరిడాలో అక్టోబర్ మాసం కాబట్టి, ఎయిర్ కండిషన్ లేకున్నా లాగించ గలుగుతున్నాము. కానీ ఇలా రోటీన్ పోయి ఏదో కాందిశీకుల లాగ బ్రతకాలంటే కష్టంగానే ఉంది.

పవర్ లేకపోవడం, ఇండియాలోనుంచి వచ్చిన ఈ రోజు కాల్స్ బాగా చీకాకు కలిగిస్తున్నాయి. అందరూ వారి బాధలు నా దగ్గర గోడు పోసుకునేవాళ్ళే. దానికి తోడు, పోయిన సారి 'ఇర్మా' హరికేన్ లో మా వెంబడే తన తోక ఆనందంగా ఆడిస్తూ, తిరిగిన మా పెంపుడు కుక్క గోపన్న గుర్తుకు వచ్చి తెగ బాధనిపిస్తున్నది.

పడక మీద నుంచి లేచాను. చిమ్మ చీకటి. చీకట్లోనే తడుముకుంటూ బెడ్ రూం బయట పడ్డాను. ఒకటి రెండు చోట్ల ఫర్నిచర్ కాళ్ళకు అడ్డం తగిలాయి. వెనుక లానై లో చూస్తే లూసఫర్ కూర్చుని ఉన్నట్లు అనిపించింది.

దగ్గర పోయి చూడబోతే "ఏంటమ్మా సీత? నిద్ర పట్టలేదా ?" లూసఫర్ ప్రశ్నించారు.

"అవునండి. నిద్ర పట్టలేదు."

లూసఫర్ పక్కనున్న కుర్చీలో నేనూ కూలబడ్డాను. ఒంటరిగా ఉన్నాడని నేనే లూసఫర్ ను ఈ తుఫాను సమయంలో మా ఇంట్లో ఉండమని పిలిచాను. మరియా గారు ఉంటే స్పానకోపిట, బాక్లావ లాంటి చిరుతిండ్లు రోజంతా దొరికేవి.

"ఏంటి డల్ గా ఉన్నావు?"

"అరె చీకట్లో కూడ నా ముఖం మీకు కనబడుతుందా? ఎలా? అవునండి ఇవ్వాళ పొద్దున్న మళ్ళీ మా ఇంట్లో వాళ్ళ బాధలు వినాల్సి వచ్చింది. అంతా విని సమస్య పరిష్కారం సూచిస్తే అది పట్టించుకోరు. అందరి బాధలకు నేనో డంపింగ్ గ్రౌండ్ అయ్యిపోయాను. దానికి తోడు ఈ తుఫాను తాకిడికి దెబ్బలు తిన్న చెట్లు చూస్తే చాల బాధగా అనిపిస్తున్నది. ఎన్ని పక్షుల గూళ్ళు కూడ ఆ చెట్లతో బాటు పోయాయో. "

లూసఫర్ ఒక క్షణం మౌనం పాటించారు. ఆయన నా ముఖం చూస్తున్నట్లు అనిపించింది.

"సీత, నువ్వేదో డిప్రెషన్ లో పోయేటట్లు ఉన్నావు. నిన్ను ఇది వరకు ఇలా చూడలేదు. నీకో నీట్ ట్రిక్ చూపెట్టనా? ఇట్స్ ఫన్."

"గో ఎహెడ్. ఏదో ఫన్ అంటున్నారు," చీకట్లో ఈయన చేసే ట్రిక్కు ఏంటబ్బా, అని కొంచెం కుతూహలం గానే అన్నాను.

"ఆకాశం చూసావా? ఎంత అందంగా ఉందో కదా?"

"ఇప్పుడు చిమ్మ చీకటి కాబట్టి నక్షత్రాలతో తళ, తళ మెరుస్తూ బాగానే ఉంది"

"అంతేనా నీకు కనిపించింది. నాకు సెంటార్, స్కార్పియో, స్కేల్స్...అన్ని బొమ్మలు కనిపిస్తున్నాయి," అంటూ లూసఫర్ ఆకాశం చూసి ఆనంద పడి పోసాగారు. నా నుంచి తననుకున్న స్పందన రాలేదని అనుకొని వుండాలి, "పోనీ నీకు ప్రపంచంలోనే పెద్దదైన ఒక గడియారాన్ని పరిచయం చేయానా?" అని మళ్ళీ అడిగారు.

"సూర్యచంద్రుల గురించే కదా మీరు చెప్పేది. వారి కదలికల బట్టి సమయం అంచనా వేయవచ్చు" అన్నాను నేను.

"కాదు నేను నీకు పరిచయం చేయబోయేది నిజంగా గడియారం లాగానే పని చేస్తుంది. నీకు అర్స మేజర్ నక్షత్ర మండలం తెలుసా?"

"విన్నాను. దానిని మా వాళ్ళు 'సప్తర్షి మండలం' అంటారు. మా పెళ్ళిలలో అరుంధతి నక్షత్రం చూపెడతారు. అది వశిష్ఠుని పక్కన ఉందని చెప్తారు."

"బహుశా అర్సా మేజర్ లోని మైజార్ నక్షత్రం అయ్యి ఉంటుంది. ఆ నక్షత్ర మండలం ఎక్కడ ఉందో చెప్పు."

"నాకు తెలియదదండి. ఆకాశం నాకు, జాక్సన్ పాలక్ నల్ల కాన్వాస్ మీద చిల్లులు పడిన తెల్ల పెయింట్ కేన్ తీసుకొని పిచ్చిగా పరిగెత్తినప్పుడు తెమిలిన చిత్రం లాగా ఉంది. ఆయన చిత్రాలు అర్థం కావు, ఈ ఆకాశంలోని నక్షత్రాలు, వాటి రాశులు కూడ ."

"జాక్సన్ చిత్రం అని ఎందుకనుకుంటావు. ఒక జార్జ్ స్రూ చుక్కల చిత్రం లా చూడు. ఎంత అందంగా కనిపిస్తుంది. ఆ మూల ఉన్నది అర్స మేజర్. ఇటువైపు ఉన్నది స్కార్పియో...ఆకాశం మొత్తం ఒక బొమ్మల చిత్రం లాగా కనిపిస్తుంది నాకు. కాదంటే, సమయాన్ని బట్టి ఈ చిత్రం కదులుతూ, మారుతుంటుంది."

"నాకేమీ బొమ్మలు కనడడం లేదు. ఆ అర్స మేజర్ తో సహా."

"అటు దిగంతం వైపు చూడు. అక్కడ చతురస్రం లాగ నాలుగు చుక్కలు వాటికి తోక ఉన్నట్లు మరో మూడు నక్షత్రాల సముదాయం కనిపిస్తుందా?"

"కనిపించిందండి. అంత స్పష్టంగా కనిపిస్తున్నది, ఎలా మిస్ అయ్యాను"

"మన చూపులోనే ఉంది. పరిచయం ఆయ్యితే ఈ ఆకాశం అలికినట్లు ఉండదు. ఏదో గొప్ప కళా చిత్రం లాగా కనిపిస్తుంది."

"మరి గడియారం ఎక్కడ ఉంది?"

"గగనమే మన గడియారం. సమయం చెప్పడానికి నీకు మరో నక్షత్రం పరిచయం చేయాలి. అర్స మేజర్ చివరలో ఉన్న దూబీ, మెరాఖ్ నక్షత్రాల నుంచి ఒక గీత గీస్తే, ఆ గీత బాగా మెరుస్తున్న ఆ నక్షత్రం మీద పోయేటట్లు కనిపిస్తున్నది కదా. అదిగో ఉత్తరం వైపు చూడు, అదే పోల్ స్టార్. అదే మనకు ఒకే స్థానంలో ఉండి దిక్కులు చూపెడుతుంది. ఆ పోల్ స్టార్ కేంద్రం గా, దూబీ, మెరాఖ్ నక్షత్రాలు మొనగా ఒక గడియారం గంట ముల్లు ఊహించుకో. ఈ అర్స మేజర్ ఆ పోల్

స్టార్ చుట్టూ తిరుగుతుంది. ఇప్పుడక్కడ ఉన్న అర్స మేజర్, మరో మూడు గంటల తరువాత అక్కడ కనిపిస్తుంది," అంటూ ఆ నక్షత్ర మండలం ఎడమవైపు చూపెట్టారు.

నా చిన్నప్పుడు నాన్న దగ్గర విన్నాను. రాత్రులలో మంచెలపై పడుకొని, జాములు లెక్క పెడతారని. ఇప్పుడు అదెలా చేస్తారో తెలిసింది. తరువాత గూగుల్ చేస్తే తెలిసింది. అతను చెప్పిన దూబీ నక్షత్రం క్రతు మహర్షి, మెరాఖ్ నక్షత్రం పులహ మహర్షి యని. పోల్ స్టార్ ధ్రువ నక్షత్రమని అది వరకే తెలుసు.

"అంటే మబ్బేస్తే మీ గడియారం పనిచేయనట్టే కదా?" చిలిపి గానే అడిగాను నేను, లూసఫర్ ను ఇబ్బంది పెడదామని.

"నిజమే. కానీ నా చుట్టూ చాల గడియారాలు ఉన్నాయి. అక్కడ మల్లె పొద చూసావు కదా. అలానే ఇటు వైపు పారిజాతం, నైట్ క్వీన్ పూల చెట్లు, మొక్కలు. ఇవ్వన్నీ ఒకో సమయం, ఒక్కోటి విరబూసి పరిమళం వెదజల్లుతుంటాయి. ప్రతీ గంటకు దానికంటూ పరిమళం ఉంటుంది. నేను ఇట్టే గుర్తుపట్టి చెప్పేయగలను."

"మీకు జలుబు చేసిందనుకోండి!"

"చెవులు పనిచేస్తాయి కదా. రాత్రులలో కూడ చప్పుళ్ళు ఉంటాయి తెలుసా. కీచురాయి, రకూన్, పాసం, ఆ లేక్ లో ఉన్న గోదురు కప్పలు – ఒకో సమయానికి ఒక్కో రకం జంతువులు చురుక్క తిరుగుతూ సవ్వళ్ళు చేస్తుంటాయి. దాని బట్టి ఏ టైమో చెప్పగలను."

"మరీ జలుబు చేస్తే చెవులు వినపడవు కదండీ!"

"అప్పుడు నాముందున్న ఈ జిన్ కాక్టెయిల్ ను నా గడియారంగా చేసుకుంటా. సమయం బట్టి, ఈ డ్రింక్ చల్లదనం కూడ మారుతుంది. అది నా నాలుక పట్టేస్తుంది. అంతే కాకుండా నాకు ఒక కాక్టెయిల్ డ్రింక్ పూర్తి కావడానికి సమయం మూడు గంటలు పడుతుంది."

"ఒక వేళ మీ డ్రింక్స్ స్టాక్ అయిపోయి, మీరు కొనడానికి ఇప్పటిలా వీలు పడలేదనుకోండి."

"మొత్తం మీద నువ్వు నాకు గడియారం అవసరం ఉందని, నా నోటి చేతనే చెప్పించాలని కంకణం కట్టినట్లు ఉన్నావు. నేనీ మధ్యనే ఒక కొత్త వాచ్ కొన్నాను. ఇదిగో నా చేతికి కట్టుకున్నది అదే. కాదంటే ఈ వాచ్ నాకు చీకట్లో కూడ పనిచేస్తుంది. ఇప్పుడు సమయం రాత్రి పదకొండు గంటల పదకొండు నిమిషాలు."

నా ముఖం మీది చూపులు తిప్పకుండానే తను గడియారం తడిమి సమయం చెప్పడం ఆశ్చర్యమేసింది.

"భలే చెప్పారండీ. నా ప్రశ్నలన్నిటికీ మీ దగ్గర సమాధానాలు ఉన్నాయి. ఆమ్ ఇంప్రెస్డ్. నేనున్న పరిస్థితి కి వీటికి సంబంధం ఏంటి? లెట్ మి గెస్. నన్ను చీర్ అప్ చేయడానికి చెప్పారు కదా."

"అదొక కారణం కూడ. కానీ నువ్వు చాల సెన్సిటివ్ సీత. బుద్ధుని లాగ ఈ లోకం లో జరుగుతున్న బాధలకు దూరంగా, నువ్వు నీ ఫ్యామిలీని విడిచి పారిపోలేవు కదా. కానీ నీకు పరిచయం చేసిన ఈ గగనం, ప్రకృతి వల్ల మన ఉనికి ఈ విశాల విశ్వంలో ఎంత చిన్నదో, ఎంత క్షణికమో తెలుస్తుందని నా ఆశ. అది అర్థమయితే నువ్వు పడుతున్న బాధ అర్థంలేదనిపించి కొంత తెరపి పడతావనుకున్నాను."

లూసఫర్ మాటలు విన్న వెంటనే ఒక రెండు నిమిషాలు ఆలోచనలో పడ్డాను. ఆయన చెప్పిన మాటలు, ఆయన కారణాలు విశదీకరించ ముందే ఉపశమనం కలిగించాయి. బహుశా ఆయన అలా వివరించి చెప్పిన తరువాత భవిష్యత్తు లోనూ ఇలాంటి నిరాశ, నిస్పృహలు ఆవహించవేమో.

"అవునండి. మీతో మాట్లాడిన తరువాత బాగుంది. థాంక్స్."

"మరో విషయం. నీ చిలిపి ప్రశ్నలతో నువ్వే మరో జీవిత రహస్యం బయట పెట్టావు. సమయం ఎంత? అన్న ప్రశ్నకు, ఎన్ని సమాధానాలు దొరికాయి! అందుకే సమస్యలు ఎదురయ్యితే, బాధ పడద్దు, డిప్రెషన్ వైపు పరుగులు తీయొద్దు. సమాధానం కోసం వెదుకు. కృషి ఉంటే, అది ఏదో ఒక రూపంలో దొరికే తీరుతుంది. ఆ వెతుకులాటలో, వీలుంటే ఇతరులకు నీకు చేతనైనంత సహాయం చేయి. ఇన్ ద లాంగ్ రన్, అది సంతృప్తి, సంతోషం కలుగ చేస్తుంది."

చీకట్లోనే అవునన్నట్లు చిరు నవ్వు నవ్వాను నేను. ఒక రెండు నిమిషాల మౌనం రాజ్యమేలింది. చివరికి లూసఫర్ నోరు విప్పారు.

"ఈ చీకటి నాకు మంచి నేస్తమే, నేను చూడ గలను. చీకట్లో కనపడదనుకొని జనాలు నాతో మాట్లాడేటప్పుడు, ప్రొద్దున వాళ్ళ ముఖాలకు కప్పుకున్న ముసుగులు తీసేసి, స్వేచ్ఛగా మాట్లాడుతారు. నాకు ఈ సమయంలో మనుష్యులు ఇట్టే అర్థమైపోతారు. అవతలి వాడు వినే మూడు లో లేనప్పుడు నేను ముభావంగానే ఉంటాను."

నేను లూసఫర్ నుండి వీడ్కోలు తీసుకొని, లానై నుంచి లోపలికి బెడ్ రూం వైపు అడుగులు వేసాను. లూసఫర్ చివర్లో సంబంధం లేకుండా చెప్పిన విషయం, విశ్వం గురించా? విశ్వం కు లూసఫర్ మీదున్న నిమ్నతా భావం విశ్వం ముఖం చూసి లూసఫర్ చదివేశారా. విశ్వం లూసఫర్ ఒక లూసర్, డంబ్, పెద్దగా మాట్లాడడు అని నాకు చెప్పిఉంటాడని ఊహించారా?

బెడ్రూంలో విశ్వం ఇంకా ఆద మరచి నిద్ర పోతున్నాడు. నేను నడుము వాల్చాను. చాలా రోజుల తరువాత పడుకున్న నిమిషాలలోనే గాఢమైన నిద్ర పట్టేసింది.

తుఫాను తరువాత పవర్ రావడం, పరిస్థితులు మామూలు అవ్వడంతో లూసఫర్ తన ఇంటికి వెళ్ళిపోయారు. అందరి లాగానే కప్పుపైన తుఫాను దెబ్బకు ఎగిరిపోయిన టైల్స్ వేయించడంతో బాటు, ఇంట్లో ఏవో చాలా పనులు

పెట్టుకున్నారు. ఒంటరిగా ఉన్న అతను, ఇంటికి ఎందుకు ఇన్ని మార్పులు చేయిస్తున్నారో, మళ్ళీ కొత్త ఇల్లు లాగ ఎందుకు పెయింట్ చేయిస్తున్నారో అర్థం కాలేదు.

ఒక రెండు నెలల తరువాత పడుకోబోయే ముందు మరుసటి రోజు ట్రాష్ పిక్ అప్ డే అని గుర్తుకు వచ్చింది. కొన్నిసార్లు పొద్దున పని తొందర్లో ఆలస్యం చేస్తే ట్రక్ వాడు వచ్చి వెళ్లిపోతాడని, రాత్రే చెత్త ఇంటి ముందుపెట్టడం మొదలు బెట్టాను. బయట గారాజ్ తలుపు తీస్తే లూసఫర్ గొంతు వినిపించింది.

"కాస్త ఆగు సీత, నా ట్రాష్ కూడ ఉంది. మీ బిన్ లో వేస్తాను. నేను రేపు యూరప్ ట్రిప్ పోతున్నాను," అన్నారు.

"ఏంటి అకస్మాత్తుగా ఈ ట్రిప్?" అడిగాను నేను.

"చాల రోజులనుండి అనుకుంటున్నదే. పనిలో పని, మా పూర్వీకులు ఒక వందేళ్ల క్రితం వలస రాక ముందు గ్రీసు దేశంలో వారు నివసించిన ప్రాంతాలు కూడ చూసి వస్తాను."

"ఆసం! ఎంజాయ్ ది ట్రిప్"

చిన్న బ్యాగ్ చెత్త గార్బేజ్ బిన్ లో వేసారు లూసఫర్. రీసైకిల్ ట్రాష్ బిన్ లో చాలానే డంప్ చేసారు. మూత వేయలేనంత నిండిపోయింది. ఆ బిన్ పై పైనే లూసఫర్ ఫ్యామిలీ ఆల్బమ్స్, విడిగా ఉన్న ఫ్యామిలీ ఫోటోలు చాలానే కనిపించాయి.

చీకటి అయ్యిపోయిందోచ్ అంటూ, అలెక్సా, ' లైట్స్ ఆన్ ' అని కూసి, తన కర్తవ్యం నెరవేర్చుకుంది.

కాలం ఎంతగా మారిపోయింది. టైం ప్రకారం మన దినచర్య నడవడానికి చాలానే వెసులు బాట్లు వచ్చేసాయి. నాకు చీకటంటే భయం లేదు. మిలటరీ లో పనిచేశాను. వెలుగు చీకట్లు రెండు ఒకటే.

ఇంతలోనే డోర్ బెల్ మోగింది. ఫోన్ లో రింగ్ ఆప్ వైబ్రేట్ అయ్యింది. బయట ఎవరో వచ్చినట్లు ఉన్నారు. లేచి పదడుగుల వేస్తే గుమ్మం. ' కొత్తగా ఇల్లు చేరాను. నన్ను వెదుక్కుంటూ, ఎవరు వచ్చారబ్బా?' అనుకుంటూ తలుపు తెరిచాను.

అప్పుడే విరుస్తున్న మల్లెల, ఫ్రెష్ గా చేసిన కేకు సువాసనలు ఎదురయ్యాయి. నేను ముందుకు చాచిన చేతిని గట్టిగా పట్టుకొని కరచాలనం చేశాడు వచ్చినతను. పోల్చుకున్నాను నేను.

"విశ్వం, సీత? నా పేరు యెహానెస్. జాన్ అని పిలవండి," నేనే ముందు పలకరించాను.

"ఎలా గుర్తు పట్టారు మమ్మల్ని. ఇది వరకు కలువలేదు కదా," అంది సీత.

“లూసఫర్ గారు మీ గురించి చెప్పారు. మీరు కేక్స్, కుకీలు చాల బాగ బేక్ చేస్తారని కూడ చెప్పారు. ఇద్దరు కలిసే తిరుగుతారనీ చెప్పారు. మీరు నాకు ఇలా కేకు తెచ్చి ఇవ్వడంతో మీరు నా పొరుగువారని తెలిసిపోయింది. సో జస్ట్ పుట్టింగ్ టూ అండ్ టూ టుగేదర్, ” అంటూ నవ్వేస్తూ, ఎదురుగా వేసిన సోఫాలో వాళ్ళని కూర్చోమని, నేను కూర్చున్నాను.

“ఇల్లు బాగా మారిపోయింది. మీరు కూడ మినిమలిస్ట్ గా ఎంత అందంగా ఇల్లు అమార్చారు. ఇల్లు విశాలంగా, బాగా స్పేషియస్ గా కనిపిస్తున్నది. ఇంటికి వస్తూనే ఏదో ఆనందం అనిపిస్తుంది,” అంది సీత.

“అవును. గోడల మీద ఒక చిన్న ఫ్రేమ్ తప్పితే, మరేమీ తగిలించలేదు. ఏదో మెడల్ లాగ ఉంది,” అన్నాడు విశ్వం. అతని దృష్టి నా ‘పర్పుల్ హార్ట్’ మెడల్ మీద పడింది.

“ఇది వరకు నేను మిలటరీ లో పని చేసే వాడిని. ఆ మెడల్ నేను ఆఫ్ఘనిస్తాన్ లో ఉన్నప్పుడు తగిలిన గాయాలకు గుర్తింపుగా ఇచ్చారు,” అన్నాను నేను.

“ ‘పర్పుల్ హార్ట్!’ ఇది వరకు చూడలేదండి. మీ సేవకు మా జోహార్లు,” అంది సీత.

“లూసఫర్ మా ఊరి పిల్లలకు తన షాప్ లో ఉద్యోగం ఇచ్చి, అవసరమైతే మెంటార్ గా సహాయపడే వాడు. సింగిల్ హోంలో పెరిగిన నాకు, ఆయన నాకు మా నాన్న లేని లోటు తీర్చాడు. అందుకే ఆఫ్ఘన్ యుద్ధంలో నాకిచ్చిన పర్పుల్ హార్ట్ మెడల్ లూసఫర్ కు పంపించాను. అది ఆయన ఇంట్లో నే ఉంటే తగిన గుర్తింపు ఉంటుందనిపించింది. ఏమిచ్చినా తీర్చుకోలేని ఆయన సహాయానికి నా చిరు టోకెన్.”

“అవును. ఇప్పుడే ఈ ఇంటికి చేసిన మార్పులు చూడడం. మీ పర్పుల్ హార్ట్ ఇంటి మధ్యలో తగిలించడం, ఆ మెడల్ కు, మీ సేవకు గొప్ప మర్యాద ఇచ్చినట్లే,” అంది సీత.

“మినిమం ఫర్నిచర్ తో బాటు చేసిన ఈ మార్పులు నాకు తెగ సౌకర్యంగా ఉన్నాయి,” అన్నాను నేను.

“మార్పులు బాగున్నాయి కానీ, ఈ గోడల మీద పెయింటింగ్ సరిగా చేయ లేదనిపిస్తుంది. అక్కడక్కడ ఎత్తు తగ్గులు ఉన్నాయి. అలానే కార్పెట్ తీయించి, ఫ్లోర్ టైల్స్ అన్నీ కొత్తగా వేశారు. టైల్స్ ఫినిష్ రఫ్ గా ఉంది. వాటి మీద నడవడానికి స్మూత్ గా లేవు. మీకు తెలిసిన లూసఫర్ ఇల్లని, మీరు కొనేసారా?” ఈసారి విశ్వం గొంతు విప్పాడు.

“లూసఫర్ నాకు చిన్నప్పటి నుండి తెలుసండి. టార్పాన్ స్ప్రింగ్స్ లో ఉండే వారంతా గ్రీక్ వారసులు, నాతో సహా. చిన్న ఊరు. అందరు ఒకరికొకరు తెలుసు.”

“వాళ్ళబ్బాయి ఇల్లు అమ్మేస్తాడని నేను ముందే ఊహించాను,” అంది సీత.

“మీరిద్దరూ పొరబడ్డారు. ఇల్లు నేను కొన లేదు. నాకు లూసఫర్ గారే స్వయంగా వ్రాసి ఇచ్చారు. వాళ్ళబ్బాయి కాదు.”

“ఊరికే ఇచ్చేసారా? వాళ్లబ్బాయి ఊరుకోని ఉండడే!” ఆశ్చర్యం వ్యక్త పరిచాడు విశ్వం.

“నిజమే. వాళ్ళబ్బాయి నాకు హై స్కూల్ సీనియర్. అతను ఇంటి గురించి బాగానే గొడవ చేశాడు. అన్నట్లు, మీరు టీ తీసుకుంటారా?,” అంటూ లేచి ఐదడుగుల పక్కకు, పదడుగుల ముందుకు వెళ్ళి, కప్బోర్డు తెరిచి మూడు కప్పులు తీసి, నీటితో నింపి, మైక్రోవేవ్ లో వేడి చేసి, ఒక ట్రే లో టీ పాకెట్స్ , షుగర్, స్వీట్నర్ తో సహా తెచ్చి మా ముందున్న టేబిల్ పైన పెట్టాను.

“నేను టీ కలుపుతాను. మీకే ఫ్లేవర్ ఇష్టం?,” సీత అంది.

“ఎర్ల్ గ్రే ఇష్టమండి. థాంక్స్. ఇంతకీ నా చేతికి ఈ ఇల్లు ఎలా వచ్చిందనే కదా ప్రశ్న. నేను లూసఫర్ తరచు మాట్లాడుకుండేవారము. నేను ఆఫ్ఘన్ యుద్ధంలో గాయ పడి ఆర్మీ నుంచి తిరిగి వచ్చిన తరువాత, తను నన్ను ఇక్కడికి రమ్మని అడగడంతో, ఊరు మారి ఇక్కడే ఉన్న మెక్డిల్ ఎయిర్ ఫోర్స్ బేస్ బ్యాక్ ఆఫీసు లో ఒక ఉద్యోగం సంపాదించుకున్నాను. ఈ నగరంలో రెంట్ లు బాగా ఎక్కువే అయినా, ఆయనున్న నగరంలోనే నేను ఉండడం, నాకు సంతోషంగానే ఉంది. ఒక రోజు తమ ఆఫీసు కు రమ్మని, ఒక అటార్నీ ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది. నేను వారు చెప్పిన సమయానికి పోతే, అప్పటికే అక్కడున్న లూసఫర్ వాళ్ళబ్బాయి, నేనక్కడ ఏమి చేస్తున్నాని ఆశ్చర్య పడ్డాడు. అతను నేను ఒకే హై స్కూల్ లో చదివినందువల్ల నన్ను వెంటనే గుర్తు పట్టాడనుకుంటాను. అప్పుడే మమ్మల్ని పిలిచిన అటార్నీ పెద్ద షాక్ ఇచ్చాడు. అతను మమ్మల్ని పిలిచింది లూసఫర్ వ్రాసిన విల్లు గురించి మాట్లాడడానికి. తన దగ్గరున్న బ్యాంక్ అకౌంట్లు లో కొంత డబ్బు వాళ్ళబ్బాయికి, మిగిలింది స్వచ్ఛంద సేవాసంస్థలకు పంచాడు. ఈ ఇల్లు మాత్రం నాకు ఇవ్వమని ఆదేశం.”

“ఏకంగా ఇల్లే. లూసఫర్ నా కంతు బట్టలేదు. ఎంత చారిటీ అయినా ఇంట్లోనే మొదలవ్వాలి కదా. తన పిల్ల వాడికి కాకుండా, మీ కెందుకిచ్చాడు,” అన్నాడు విశ్వం.

“లూసఫర్ నాకు ఇల్లు ఇవ్వడం ఆశ్చర్యమే. లూసఫర్ వాళ్ళబ్బాయి మొదట కోపంతో కేకలు వేశాడు. తన ఇద్దరు చెల్లెలతో ఫోన్ లోనే మంతనాలు జరిపాడు. తరువాత లాయర్ లను సంప్రదించాడు. ఇక లాభం లేదని తెలిసిన తరువాత తిరిగి న్యూ జెర్సీ కి వెళ్ళిపోయాడు.”

“లూసఫర్ ది సీదా, సాదా జీవితం. ఎలా వచ్చారో, ఎలా జీవించారో గొప్పగా చెప్పడానికి ఏమి ఉండదు. మీకిల్లు ఇవ్వడం అతిశయమే కానీ, ఈ సమాజానికి ఏమి తెలుస్తుంది. చాల మందివి ఇలాంటి గుర్తింపు లేని సగటు జీవితాలే,” ‘ప్చ్’ అంటూ పెదవు విరిచాడు విశ్వం.

విశ్వం మాటలు నాకు అంతగా నచ్చ లేదు. టీ త్రాగడం అయ్యింది. విసా విసా లేచి వెనక్కు పది అడుగులు వేసి పర్పుల్ హార్ట్ మెడల్ తగిలించిన గోడ దగ్గరకు వెళ్ళాను. ఆ మెడల్ ఉన్న ఫ్రేమ్ ను, దానికింద ఉన్న గోడను సుతారంగా

తాకాను , "*దే అల్సో సర్వ్, హూ స్టాండ్ అండ్ వెయిట్!*★" అని లూసఫర్ పలికినట్లనిపించింది. అవే మాటలు నేను పైకి వల్లించాను.

"జాన్ మిల్టన్ కోట్ కదూ. నాకది చదివి నప్పుడు మా భగవద్గీత కర్మ సిద్ధాంతం గుర్తొస్తుంది. మీరన్నది నేనూ ఏకీభవిస్తాను. లూసఫర్ గడిపిన జీవితం కూడ గొప్ప జీవితమే. పేరుపొందిన వారి జీవితాలకేమాత్రం తీసిపోదు," అంది సీత.

విశ్వంకు లూసఫర్ పూర్తిగా అర్ధమైనట్లు లేదు. సీత చెప్పిన మాటలు నచ్చకపోయి ఉండాలి. కాకపోతే, ఉన్నట్టుండి, 'జాన్, లూసఫర్ అన్న పేరు నాకస్సలు అంతుబట్ట లేదు. అదేం పేరు? సైతాన్ పేరు పెట్టుకోవడమేమిటి?' అని ప్రశ్నించి ఉండేవాడు కాదు.

"జాన్, మీరు విశ్వం మాటలు పట్టించుకోకండి?" సీత విశ్వం మాటలు త్రుంచేస్తున్నట్లు మాట్లాడింది.

"అబ్బే మంచి ప్రశ్నే, విశ్వం. లూసఫర్ పేరు రెండు సంస్కృతులలో వస్తుంది. పాశ్చాత్య దేశస్తులకు లూసఫర్ దేవుడిని ఎదురించి నరకానికి పోయిన దుష్టుడే. కానీ గ్రీక్, రోమన్ దేశాస్తులకు లూసఫర్ వెలుగునిచ్చే దేవత. ఆకాశంలో అత్యంత ప్రకాశంగా మెరిసే వేగు చుక్క వీనస్ ను లూసఫర్ అని పిలుస్తారు. ఆలా మాలో చాల మందికి వెలుగునిచ్చారు ఈ లూసఫర్, కూడ . అది ఆయనకు తగిన పేరే కదా," అన్నాను నేను.

మా మధ్య స్టేల్ మేట్ ను సూచిస్తూ మౌనం రాజ్యమేలింది.

"టైం అయ్యినట్లుంది. బయలు దేరుదామా?" విశ్వం నుద్దేశించి అంది సీత.

"ఇప్పుడే ఏడు గంటలయ్యింది," అన్నాను నేను.

విశ్వం, సీత వెళ్లిపోతుంటే, గుమ్మం దగ్గరికి నేను వెంట వెళ్ళాను. సీత నన్ను దగ్గరకు తీసుకొని హగ్ ఇస్తూ, "జాన్ నీ దగ్గరున్న వాచి నేను లూసఫర్ దగ్గర చూసాను. ఈ ఇల్లు లూసఫర్ నీ కనే కట్టాడు. ఈ ఇంట్లో మార్పులు చేయడానికి కారణం అర్ధం అయ్యింది. ఈ ఇంట్లో నేలా, గోడా అన్నీ మాట్లాడుతాయి. ఆ మాట్లాడే భాష లూసఫర్ పని కట్టుకుని నేర్చుకున్న భాష. నువ్వు జీవించడానికి ఉపయోగ పడే భాష. నీకు ఏ అవసరమైన మాకు కాల్ చేయి," అంది.

సీత చెప్పిన వాచి లూసఫర్ ఇంటితో పాటు ఇచ్చిన మరో గిఫ్ట్. దానికోసం గొడవవేమి జరుగలేదు. ఆ వాచి అవసరం లూసఫర్ అబ్బాయికి లేదు. విశ్వం, సీతలకు కూడ లేదు.

గుమ్మం నుంచి, సోఫాకు దూరం, దిక్కు టైల్స్ మీదున్న గరుకు, పాదాల ద్వారా సూచిస్తున్నది. సోఫాలో కూర్చుని, నా చేతికున్న వాచిని మరో సారి తడిమాను. లూసఫర్ గొంతులో సమయం "ఏడు గంటల ఐదు నిమిషాలు," అని వినిపించింది. నేను తడిమిన వేళ్ళకు కనిపించింది.

జాన్ మిల్టన్ తన గుడ్డితనం గురించి వ్రాసిన పద్యంలో నుంచి తీసుకున్న ఆఖరి వాక్యం. మిల్టన్ 17 వ శతాబ్ది లో జీవించిన ప్రఖ్యాత ఆంగ్ల కవి. అతనికి తన నలభై ఏళ్ల వయస్సులోనే కంటిచూపు పోయింది. అతను వ్రాసిన 'ప్యారడైజ్ లాస్ట్' 'ప్యారడైజ్ రిగైనెడ్' కవితా గ్రంథాలు కంటి చూపు కోల్పోయిన తరువాత, స్టెనో సహాయంతో వ్రాయించి, ప్రచురణ చేసినవి.

Post your comments